క్లుప్తంగా

రోడ్డు మరమ్మతుకు శ్రమదానం



అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజీ సమీపంలో రాయచూర్ – కర్నూల్ రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు బైక్ మెకానిక్ రాజు శనివారం శ్రమదానం చేసి పూడ్చారు. రోడ్డుపై లోతైన గుంతలు పడడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతుండడంతో వాటిని చిన్న చిన్న రాళ్లు, మట్టితో పూర్తిగా పూడ్చాడు. దీన్ని గమనించిన ప్రయాణికులు శ్రమదానం చేసిన రాజును అభినంధించారు.

పంటపొలాల్లో రైతులతో సభ్యత్వం

మానవపాడు: పంటపొలాల్లో రైతులతో సభ్యత్వ కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చెన్నిపాడు, మానవపాడు, పోతులపాడు గ్రామాల్లో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అలంపూర్ నాయకులు రాజగోపాల్, బలరాంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కేకేరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన కల్పించాలి

ఎర్రవల్లి: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, కేకే రెడ్డి, నాగేశ్వరెడ్డి, అబ్దుల్, వెంకటేష్, జనార్దన్‌రెడ్డి, మహేష్, నరేష్, నాగముని, గోపాల్, సుధాకర్, షఫీ, తదితరులు ఉన్నారు.

గోమాత సేవ.. దైవ సేవతో సమానం

మానవపాడు: గోమాత సేవ.. దైవ సేవతో సమానమని గోమాత భక్తుడు యోగీశ్వర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గోమాత అనారోగ్యంతో మృతి చెందింది. మూడ నెలలుగా అనారోగ్యంతో బాధ పడింది. యోగీశ్వర్, శకుంతల దంపతులు మూడు నెలలు గోమాతకు సేవలు అందించారు. గోమాత మృత్యువాత పడడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

కాటికాపరుల సంఘం ఆవిర్భావ ఉత్సవాలు



అలంపూర్: అలంపూర్ చౌరస్తాలో మాల బ్యాగరి కాటికాపరుల శ్మశాన వాటికల సంక్షేమ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తు కేశవులు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సమావేశంలో సంక్షేమ సంఘం డిమాండ్ల సాధనపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ నగేష్, నాయకులు మద్దిలేటి, నాగరాజు, వెంకటేష్, సుధాకర్, రంగస్వామి, గోపాల్, శేఖర్ ఉన్నారు.

58 మందిపై కేసులు నమోదు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. శనివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 48 మందిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 20 మందిపై రూ.4935 జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వీరన్న, తదితరులు ఉన్నారు.

డ్యాం రోడ్డుపై మరమ్మతు చేయండి



రాజోళి: రాజోళి నుంచి సుంకేసుల డ్యాంకు వెళ్లే రోడ్డుపై మరమ్మతు చేయాలని ప్రజలు కోరారు. మట్టి రోడ్డు కావడంతో గత వారంలో కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. బురదమయం కావడంతో వాహనాలు అదుపు తప్పే ప్రమాదముందని, వీలైనంత త్వరగా రోడ్డుకు మరమ్మతులు చేయాలని, సీసీ, బీటీ రోడ్డువేయాలని కోరుతున్నారు.

గణేశుడి సన్నిధిలో అన్నదానం



అలంపూర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణనాథునికి గరక పూజ చేస్తున్న మహిళలు

- పలు చోట్ల నిమజ్జనం
- 8వ రోజు భక్తుల ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: అలంపూర్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు గణేశుడికి గరకపూజ నిర్వహించారు. మండలంలోని వినాయక ప్రతిమలకు శోభాయాత్ర నిర్వహించి అనంతరం నిమజ్జనం చేశారు. తుంగభద్ర నది వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎస్‌ఐ బాషా బందోబస్తు ఏర్పాటు చేశారు.

■ అలంపూర్ మండలంలోని క్యాతూర్‌లో హరిహర దేవాలయంలో గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంకాలం గణేశ్ శోభయాత్ర నిర్వహించి నిమజ్జనం నిర్వహించారు.

■ అయిజ పట్టణంలో, గ్రామాల్లో గణపతి విగ్రహాలకు ప్రజలు పూజలు నిర్వహించారు. మండపాల వద్ద భజన బృందాలు భక్తి పాటలతో అలరించారు.



అయిజలో గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు

■ మానవపాడు మండలంలోని జల్లాపురంలో జిల్లా డీసీసీ సెక్రటరీ మహ్మద్ సిరాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

■ గట్టులో మత్స్యకార సంఘం దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు, యువకులు పాల్గొన్నారు.

■ వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో గణేశ్ యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎర్రవల్లిలో తోలుబొమ్మలాట

ఎర్రవల్లి మండల కేంద్రంలోని స్వామి వివేకానంద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో భారత సంస్కృతిని తెలియజేసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి అంతరించిపోతున్న అతి ప్రాచీణమైన కళ తోలుబొమ్మలాటను రాష్ట్రపతితో అవార్డు పొందిన కళాకారుడు ఆంజనేయులు తన బృందంతో ఎంతో వైభవంగా నిర్వహించారు.



తోలుబొమ్మలాటను ఆడిస్తున్న కళాకారులు



క్యాతూర్‌లో ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న భక్తులు



జూలెకల్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న గణేశ్‌యూత్ సభ్యులు



గట్టులో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఓటరు జాబితా ప్రదర్శన

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ కృష్ణమోహన్ ముసాయిదా ఓటర్ జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల కోసం ఓటరు జాబితాను కార్యాలయంలో ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. మార్పులు చెర్పులు కోసం ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాలు స్వీకరించాలని వెంటనే సంబంధిత బీఎల్‌ఓలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్‌కుమార్, ఖయ్యూం, పంచాయతీ కార్యదర్శి రఘు, తదితరులు ఉన్నారు.



ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ కృష్ణమోహన్

లక్ష్మీదేవమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

గద్వాల అర్బన్: ఐద్వా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ లక్ష్మీదేవమ్మ ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, లక్ష్మీదేవమ్మ ఆశయసాధనకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు మణెమ్మ, సుగుణమ్మ, లక్ష్మి, నర్సమ్మ, తదితరులు ఉన్నారు.



లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకురాలు

ప్రజా పరిరక్షణ యోధుడు సీతారాం ఏచూరి

ధరూరు: దేశంలో ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించేందుకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పాటు పడ్డారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తా వద్ద మండల సీపీఎం నాయకులతో కలిసి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటు పడ్డారన్నారు. యూనివర్సిటీల్లో నిర్బంధాలకు వ్యతిరేకగా పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నర్సింహులు, దేవదాసు, తిమ్మప్ప, రాము, ప్రవీణ్, గోవిందు, నాగరాజు, సవారన్న పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బాలికలు ఉన్నత చదువులు చదవాలి

శాంతినగర్: బాలికలు ఉన్నత చదువులు చదవాలని, బాల్య వివాహాలు చేసుకోరాదని ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ భాస్కర్‌గౌడ్ అన్నారు. వడ్డేపల్లి ఐకేపీ భవనంలో వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన మండల స్థాయి కిశోర బాలికల సంఘాల సభ్యులకు, కిషోర బాలికలకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కో ఆర్డినేటర్ సంఘాల వారికి బాలికల హక్కులు, బాలికల ఉన్నత చదువులు, బాల్య వివాహాల నిర్మూలన, కిశోర బాలిక సంఘాల బలోపేతం అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉమ్మడి వడ్డేపల్లి మండలాలకు సంబంధించి తెలంగాణ ఆడపిల్లల సమానత్వ సమాఖ్య (టీఏఎస్‌ఎస్) కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ ద్వారా మండల స్థాయిలో బాలికల సమస్యలను గుర్తించి పిటిషన్ ఇచ్చేలా వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన మహిళా సంఘాల సీసీలు తిమ్మప్ప, బుచ్చన్న, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు హనిమిరెడ్డి, రజిత, కార్యకర్తలు పాల్గొన్నారు.



కిషోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఎంవీ ఫౌండేషన్ స్టేట్ కో ఆర్డినేటర్ భాస్కర్‌గౌడ్

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

అయిజ: మండలంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు శనివారం పరామర్శించారు. మండలంలోని కొత్తపల్లిలో సుమిత్రమ్మ, కుటుకనూరులో భీమన్న కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

మండపాల వద్ద చోరీకి యత్నం

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

గద్వాల క్రైం: గణేశ్ మండపాల వద్ద గుర్తు తెలియని ఇద్దరు యువకులు చోరీకి యత్నించడంతో వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. జిల్లా కేంద్రంలోని నల్లకుంట కాలనీలో గణేశ్ మండపం వద్ద గుర్తు తెలియని యువకులు హుండీ, లడ్డు, లైట్లను అపహరించినట్లు నిర్వాహకులు గుర్తించారు. తప్పించుకునే ప్రయత్నం చేయగా వెంబడించి పట్టుకున్నారు. వారిని నిర్వాహకులు దేహశుద్ధి చేసి పట్టణ పోలీసులకు అప్పగించారు.

ఏబీవీపీ గద్వాల నగర అధ్యక్షుడి ఎన్నిక

గద్వాలన్యూటౌన్: స్థానిక కార్యాలయంలో శనివారం ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కావలి ఆంజనేయులును గద్వాల ఏబీవీపీ నగర అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఆయన గతంలో ఏబీవీపీ ఉమ్మడి పాలమూరు జిల్లా కన్వీనర్‌గా, ఉమ్మడి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవస్థ ప్రముఖ్ సురేష్, కన్వీనర్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, పూర్వ కార్యకర్తలు సతీష్, వీరశేఖర్, మురళీ పాల్గొన్నారు.

పరిహారం అందించడంలో ఆలస్యం వద్దు

రాజోళి: వర్షాల కారణంగా గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లకు, కూలిన ఇళ్లకు ప్రభుత్వ పరిహారం వెంటనే అందించాలని సీపీఎం నాయకులు విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల్లో ఇళ్లు నేలకూలాయని, చాలా మంది గూడును కోల్పోయారని, వారికి తక్షణం సహాయం అందించడంలో ఆలస్యం చేయవద్దని పేర్కొన్నారు. పంటలు ఎక్కువ మొత్తంలో దెబ్బతిని, రైతులు పూర్తిగా నష్టపోయారని వారికి కూడా పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో బ్యాంకు, పెట్రోల్ బంక్ ప్రారంభం



కో ఆపరేటివ్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్ పర్సన్ మహదేవమ్మ

ధరూరు: మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కార్యాలయం ఆధ్వర్యంలో పీఏసీఎస్ బ్యాంకు, పెట్రోల్ బంక్‌లను శనివారం మండల పీఏసీఎస్ చైర్ పర్సన్ మహదేవమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్‌లు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్ శ్రీధర్, సీసల్ వెంకట్‌రెడ్డి తదితరులు హాజరై మాట్లాడారు. ప్రాథమిక సహకార సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రైతులు ఎరువులు, పెట్రోల్‌ను కొనుగోలు చేయాలన్నారు. ధరూరు శాఖను అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్ పర్సన్ బండ్ల లక్ష్మీదేవమ్మ, అయిజ పీఏసీఎస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వైస్ చైర్మన్ పరమేష్, వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సెక్రటరీ రాజు, ర్యాలంపాడు నరేందర్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, జాకీర్, కిష్టన్న, వాహీద్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

గొందిమల్ల వాసికి డాక్టరేట్



పట్టా అందుకుంటున్న నజీర్ అహ్మద్

అలంపూర్ రూరల్: మండలంలోని గొందిమల్ల వాసి నజీర్ అహ్మద్‌కు జార్ఖండ్ రాష్ట్రం రాంచి వైబీఎన్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ వచ్చినట్లు ఆయన ఒక ప్రకటన లో తెలిపారు. శ్రీ సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లకు ప్రత్యేక సూచనలతో వినియోగదారులకు మ్యూచ్‌వల్ ఫండ్స్ ప్రయోజనాల పనితీరుపై 'తులనాత్మక అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ అందుకున్న ఆయన తన గైడ్ దేవేంద్ర కుమార్ ఓజాకి, రీసెర్చ్ రవిభూషణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల ప్రిన్సిపల్, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా కల్వర్టు

మల్దకల్ - కుర్తిరావులచెర్వుకు వెళ్లే రహదారిలో ప్రమాదకరంగా కల్వర్టు

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వు–మల్దకల్ గ్రామాల మధ్య కల్వర్టు రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టు కొద్ది రోజుల క్రితం కూలిపోయింది. ఈ రహదారిపై ప్రతినిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

- ప్రశ్నించాల్సిన అధికారి పేరు : బషీర్, పంచాయతీరాజ్ శాఖ అధికారి, మల్దకల్.
ఫోన్ నంబర్: 9848362416

బీచుపల్లిలో నిజరూప దర్శనం



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో పరివర్తన ఏకాదశిని పురస్కరించుకొని శనివారం భక్తులకు అభయాంజనేయస్వామి నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ఆంజనేయస్వామిని దర్శించుకొని ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



ఆదిశిలా క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సద్దలోనిపల్లి కృష్ణస్వామి, పాల్వాయి అడవి ఆంజనేయస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్పస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, అర్చకులు చంద్రశేఖర్‌రావు, అరవిందరావు, నాగరాజుశర్మ, వాల్మీకి పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

గద్వాల అర్బన్: మణుగూర్‌లో ద్వారక వద్ద పౌరహక్కుల సంఘం నాయకులను అప్రజాస్వామికంగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వివిధ ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్మృతివనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర పరిధిలో రఘునాథ్‌పల్లి, కరిక గూడెం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజానిర్ధారణకు వెళ్తున్న పౌరహక్కుల రాష్ట్ర కమిటీ సభ్యులు ఆరుగురిని మణుగూర్ పట్టణ ప్రాంతంలో నిర్బంధించారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు చేసిన బూటకపు ఎన్‌కౌంటర్ నిజనిర్ధారణలో బహిర్గతమవుతుందని భయపడి పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, ఇది చట్టవిరుద్ధమన్నారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబాన్, టీపీఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర కార్యదర్శి గోపాల్, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ పాష, చైతన్య మహిళా సంఘం నాయకులు జయమ్మ ఉన్నారు.



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబాన్

అఖిలపక్ష కమిటీ నాయకుల నిరసన



అప్రోచ్ రోడ్డువద్ద నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

అయిజ: మండలంలోని పులికల్ రోడ్డుపై చేపట్టిన బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయని అఖిల పక్షం కమిటీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణం, వరదలకు కొట్టుకపోయిన అప్రోచ్ రోడ్డును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యాన్ని వీడి అప్రోచ్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని, బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. పనులు ఆలస్యమైతే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుమలరెడ్డి, ఆంజనేయులు, సుధాకర్‌గౌడ్, హనుమంతు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు

అయిజ: మున్సిపాలిటీలోని ప్రధాన రోడ్ల పక్కన శనివారం విద్యుత్ అధికారులు విద్యుత్ ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ నరేందర్ రెడ్డి మాట్లాడారు. పట్టణంలో ప్రధాన రోడ్ల పక్కన గతంలో ఏర్పాటు చేసిన కొన్ని విద్యుత్ స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని పేర్కొన్నారు. వాటివల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. కొన్ని ప్రదేశాల్లో విద్యుత్ స్తంభాల మధ్యదూరం ఎక్కువ ఉండడంతో విద్యుత్ తీగలు సాగిపోయి, కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా మారాయని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ఇంటర్మీడియట్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ తీగలను సరిచేసినట్లు తెలిపారు.